సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024

I



పుణ్యమార్గం.. పేదలకు దానం

ధనికులతో సమానంగా..పేదవర్గాలు కూడా జీవనం గడపాలి. ప్రత్యేకంగా పవిత్ర రంజాన్‌ను ఎలాంటి ఆర్థికపరమైన లోటుపాట్లు లేకుండా జరుపుకోవాలి. -IIలో



రంజాన్ వేళలు

		ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాయచోటి	:	6.30	4.49
రాజంపేట	:	6.32	4.48
పీలేరు	:	6.35	4.42
మదనపల్లె	:	6.34	4.51

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 90 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	410	437
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 145.580 కిలోలు

న్యూస్‌రీల్

రమేష్ కుమార్ రెడ్డితో ఎంపీ, ఎమ్మెల్యే చర్చలు



రమేష్‌రెడ్డితో ఏకాంతంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీలు

లక్కిరెడ్డిపల్లె: రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి రమేష్‌కుమార్ రెడ్డితో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి శనివారం రాత్రి చర్చలు జరిపారు. రమేష్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

మహిళలకు ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, పెయింటింగ్‌లపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి శిక్షణ ఉంటుందని చెప్పారు. 18 నుంచి 45 సంవత్సరాల వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో నేరుగా వచ్చి కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం సంస్థ కార్యాలయం వద్దకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440905478/ 9985606866/9440933028 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం తదితరులు

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి లాక్రోస్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున సబ్ జూనియర్ జట్టు కింద పాఠశాల విద్యార్థులు వెంకటమురళి, జస్వంత్‌లు పాల్గొని రాణించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. వీరిని పాఠశాల హెచ్‌ఎం రుషికేశవ్,పీడీలు నాగరాజ,నరేష్‌బాబులు అభినందించారు.

తలనీలాల విక్రయం ద్వారా రూ.11లక్షల ఆదాయం



తలనీలాల విక్రయానికి వేలం నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు సమర్పించిన తలనీలాల విక్రయం ద్వారా ఆలయానికి రూ.11 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. అలాగే ఎండు కొబ్బరికి రూ.65వేలు వచ్చాయని చెప్పారు.నిలువ ఉన్న తలనీలాలు, ఎండు కొబ్బరి విక్రయానికి శనివారం బహిరంగ వేలం,షీల్డ్ టెండరు నిర్వహించామన్నారు. తలనీలలాను ఏలూరుకు చెందిన వేణుగోపాల్ అధిక ధరతో కొనుగోలు చేశాడని ఆయన తెలిపారు.కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, సిబ్బంది,పాల్గొన్నారు

యువజనోత్సవాల్లో సత్తా

కడప ఎడ్యుకేషన్: జాతీయస్థాయి యువజనోత్సవ కార్యక్రమంలో కడప యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన దక్షిణ భారత దేశ యువజనోత్సవాల్లో ప్రథమ,ద్వితీయ, తతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించారు.లూథియాన, పంజాబ్ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు పోటీపడ్డారు. ఇందులో దాదాపుగా 108 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పోటీపడగా వారిలో వైవీయూ విద్యార్థులు వై. అరవింద్ (కార్టూన్ విభాగంలో ద్వితీయ స్థానం), డి.రమాజ్యోతి(రంగోలి విభాగంలో తృతీయ స్థానం) , దేవదాసు (పోస్టర్ మేకింగ్ విభాగంలో తృతీయ స్థానం), కె. శ్రీలత (మెహందీ ఆర్ట్స్ విభాగంలో తృతీయ స్థానం) విజేతలుగా నిలిచారు. వీరు యూనివర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య విజయ భారతి, లలితకళల శాఖ విభాగాధిపతి డా. కె. మత్యుంజయరావు, బృందానికి నేతృత్వం వహించిన ఆచార్య పుత్తా పద్మ, జి. కాత్యాయని ఆధ్వర్యంలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. విద్యార్థులను ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు.

వాహన మిత్రతో తాత్సాహం!

లక్షలు పెట్టి.. వాహనాలు కొనుగోలు చేసి రోజువారి ఆదాయంతో జీవనం నెట్టుకు వస్తున్న చిన్నచిన్న వాహన యజమానులకు వాహనాల పనులు, బీమా ప్రీమియం చెల్లింపులు, ఫైనాన్స్ వాయిదాలు వంటివి భారంగా మారుతున్నాయి. ఇటువంటి వారి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టింది.వారికి చేయూత అందించింది.

- ఆటో,టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10వేలు
- తమ కోసం ఆలోచించిన ఏకైక సీఎం జగనే అంటున్న డ్రైవర్లు



జిల్లాలో వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం
2019–20	4946	4.94
2020–21	7350	7.35
2021–22	7338	7.33
2022–23	7563	7.56
2023–24	7990	7.99

(రూ.కోట్లలో)

మదనపల్లె సిటీ: ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్ వంటి ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం ఇచ్చేలా ఏటా రూ.10 వేలు చొప్పున ఐదేళ్ల సాయం అందించింది. ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్ డ్రైవర్లు ఏ రోజు కారోజు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బీమా సొమ్ము చెల్లించలేకపోతున్నారు. తమ వాహనాలను మరమ్మతులు చేయాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. అరకొర రాబడితో జీవనం సాగించే వీరి కుటుంబాలకు



చేయూతనివ్వాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తలపోశారు. ఏలూరు పాదయాత్రలో ఉండగా 2018 మే 14న తాను అధికారంలోకి వచ్చాక ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఈ ప్రకారమే అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 14న



వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి ఏలూరులోనే శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఏటా ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌డ్రైవర్లకు రూ.10 వేలు చొప్పున ఇస్తున్నారు. ఈ సొమ్ముతో వారు వాహన ఫిట్‌నెస్, మరమ్మత్తులు, బీమా తదితర అవసరాలు తీర్చుకుంటారన్న సంకల్పంతో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. దీంతో గడిచిన ఐదేళ్లుగా వీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో తమ కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రులు లేరని ఈ వాహనమిత్ర లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అందుకే తమకు ఆర్థికంగా దన్నుగా ఉంటామని, అండగా నిలుస్తామని చెబుతున్నారు.

బతుకు బండికి భరోసా ఇచ్చారు



నేను 15 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ఐదేళ్ల కిందటి వరకు కుటుంబపోషణ చాలా కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు.వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా వరుసగా ఐదు సంవత్సరాలు ఏడాదికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.50వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్టకాలంలో కూడా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేలు నా ఖాతాలో వేశారు. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నాను. ఆర్థికంగా ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న మాకు ఈ ప్రభుత్వం ఒక అండగా నిలిచింది.

–షేక్ బాబ్‌జాన్, గౌసియా వీధి, మదనపల్లె

అప్పుల బాధ తప్పింది



15 ఏళ్ల నుంచి ఆటో నడుతున్నాను. ఆటో నడపడం వల్ల ప్రతి రోజూ డీజిల్ ఖర్చు పోను రూ. 300 వరకు మిగిలేవి. వాటితో ఇంటిల్లిపాది జీవనం సాగించేవారం. ఆటోకు ప్రతి ఏటా ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేసుకోవలసి వచ్చేది. ఇందు కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పు తీసుకుని చెల్లించేవాడిని. ఆటో సర్వీస్‌తో వచ్చిన డబ్బు వడ్డీలకే సరిపోయేది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. జగనన్న వచ్చాక వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ తరువాత ఎటువంటి అప్పులు తీసుకోలేదు. ఆటో సర్వీసుతో వచ్చిన సొమ్ముతో చాలా సంతోషంగా జీవిస్తున్నాను.

–చాంద్‌బాషా, సైదాపేట, మదనపల్లె

జగనన్న అండగా నిలిచారు



నేను 13 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు. వరుసగా ఐదు సంవత్సరాలుగా ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్టకాలంలో కూడా వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు నా ఖాతాలో వేశారు. కుటుంబానికి ఆసరా అయింది. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎవరి చుట్టూ తిరగకుండా ఎవరికి రూపాయి లంచం ఇవ్వకుండా నేరుగా లబ్ధి చేకూరింది. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్సు,ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నా.మాలాంటి వారి కోసం ఆలోచన చేస్తున్న సీఎం జగనన్నకు పేదలందరూ అండగా ఉంటారు.

–ఎస్.ఖాదర్‌హుస్సేన్, ఇండ్రస్టియల్ ఎస్టేట్, మదనపల్లె

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి



ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఓటరు జాబితాకు సంబంధించిన ఫామ్స్ పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై ఆరా తీశారు. నియమావళిని అతిక్రమించిన వారిపై తీసుకున్న చర్యలపై ఎన్నికల అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్నందున ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 15వ తేదీలోపు పెండింగ్ ఫామ్స్‌ను పరిష్కరించాలన్నారు.

నగదు,వస్తువుల రవాణాపై పరిశీలన

ఎస్పీ కృష్ణారావు, మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నగదు, బంగారు, వెండి, మద్యం, గంజాయి, వస్తువుల రవాణాలపై డేగ కన్నుతో పరిశీలన చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎవరు అతిక్రమించకూడదని తెలిపారు.

- రానున్న ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్



రాయచోటిలోని రాణా సర్కిల్ వద్ద విద్యుత్ వెలుగులలో పత్తర్ మసీదు

కడప కల్చరల్: రంజాన్ మాసంలో అత్యంత పవిత్రం , అధిక పుణ్యఫలాలను ప్రసాదించేదిగా విశ్వసిస్తున్న లైలతుల్ ఖదర్ (బడీరాత్)ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు అన్ని మసీదుల్లోనూ రాత్రి ఇషా నమాజ్ అనంతరం ప్రత్యేకంగా ఆహ్వానించిన ధార్మిక వక్తలు పవిత్ర ఖరాన్ ప్రత్యేకత, పవిత్ర, అల్లాహ్ ఆదేశాలు, మానవాళి పాటించాల్సిన విధానాల గురించి తెలియజేశారు. మత గురువులు ఈ రాత్రి పవిత్రత గురించి, చేసే ప్రార్థనల ద్వారా లభించే పుణ్యం గురించి వివరించారు. మసీదుల్లో భక్తులు పూర్తి రాత్రి ఆధ్యాత్మిక సందేశాలు, పవిత్ర గ్రంథం పఠనం, జికర్‌లో లీనమయ్యారు. అర్ధరాత్రి తహజూద్ నమాజ్ చేసి తమ పాపాలను పోగొట్టి క్షమాభిక్ష ప్రసాదించే అద్భుతమైన క్షణాల కోసం ఎదురుచూసి దైవాన్ని శరణు కోరుతూ గడిపారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

రాయచోటి: చాంద్ రాత్(బడీరాత్) సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పవిత్ర మాసం ముగింపును పురస్కరించుకుని చివరి రెండు రోజుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించే బడీరాత్ కార్యక్రమం అన్నమయ్య జిల్లాలో ఘనంగా జరిగింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు మసీదులు, ప్రత్యేక ప్రదేశాల్లో ప్రార్థనలు జరుగుతాయి. అన్నమయ్య జిల్లాలో 540కి పైగా మసీదులు ఉన్నాయి. రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా పరిధిలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, తంబళ్లపల్లి, రైల్వేకోడూరు నియోజకవర్గాలతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా బడీ రాత్ పండుగను వేడుకగా నిర్వహించారు. ఈద్ రోజున కొత్త దుస్తులు, గాజులు, ఇతర వస్తువుల కోసం ప్రజలు షాపింగ్ చేసే పండుగ రాత్రి కూడా అంటారు. బడీరాత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఫ్లాప్ షో

- కడప గడపలో షర్మిల రోడ్‌షో అట్టర్ ఫ్లాప్
- అన్నను దూషించడాన్ని అంగీకరించని కడప ప్రజలు
- పీసీసీ చీఫ్ దుస్థితిపై ఆవేదన చెందుతున్న అభిమానులు





కడప రోడ్‌షోలో జనాలు లేక వెలవెలబోతున్న దృశ్యం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న షర్మిల

సాక్షి ప్రతినిధి, కడప: పీసీసీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి షర్మిలా ప్రచారం ఫ్లాప్‌షోను తలపించింది.వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో కొనసాగిన రోడ్ షో పలు కూడళ్లల్లో ప్రజలు లేకపోవడంతో నేరుగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నిన్న మొన్నటి వరకూ షర్మిలా కడపలో కాలు మోపితే ఎగబడ్డ ప్రజానీకం నేడు తిరస్కరిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని నోరు పారేసుకుంటుండమే అందుకు ప్రధాన కారణం. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తుండడం, నిరాధార ఆరోపణలతో రాజకీయాలు తెరపైకి రావడం కూడా మరో కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెలుగా కడప గడపలో షర్మిలా కాలుపెడితే జనం బారులు తీరేవారు. ఇదే పరిస్థితి రెండు నెలల క్రితం వరకు కన్పించేంది. పీసీసీ అధ్యక్షురాలిగా.. కడప ఎంపీ అభ్యర్థిగా రెండు రోజులుగా జిల్లాలో షర్మిలా ప్రచారం నిర్వహిస్తున్నారు. తొలిరోజు కాశినాయన మండలం అమగంపల్లె వద్ద రాజన్న బిడ్డను చూసేందుకు పదుల సంఖ్యలో ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. తొలిరోజు ప్రసంగం విన్న ప్రజానీకం షర్మిలా పర్యటనకు దూరమయ్యారనే చెప్పాలి. అందుకు జిల్లా కేంద్రమైన కడపలో నిర్వహించిన రోడ్‌షో, సమావేశాలే నిదర్శనంగా చెప్పవచ్చు. పెద్దదర్గా దర్శనానికి వచ్చిన ఆమె ముందస్తు నిర్ణయించిన సమయానికి కంటే రెండు గంటలు ఆలస్యంగా పర్యటించినా కనీస స్థాయి ప్రజలు కూడా రోడ్లుపై లేకపోవడం విశేషం.

కాంగ్రెస్ కార్యాలయానికి పయనం...

పెద్దదర్గా వద్ద సమావేశం తర్వాత, మాసాపేట సర్కిల్, దేవునికడప, అప్సరా సర్కిల్, అంబేడ్కర్ సర్కిళ్లలో షర్మిలా ప్రజలనుద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. పెద్దదర్గా వద్ద మాత్రమే కాస్తో కూస్తో ప్రజలు కన్పించారు. అక్కడ ప్రసంగించిన ఆమె మాసాపేట మీదుగా నేరుగా దేవునికడపకు వెళ్లాల్సి వచ్చింది. ఆలయ దర్శనం అనంతరం ఆశోక్‌నగర్, అప్సరా సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్కడ కూడా పట్టుమని పదిమంది ప్రజలు లేకపోవడంతో సాయంత్రం వరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనే తిష్టవేయాల్సి వచ్చింది. పీసీపీ అధ్యక్షరాలు షర్మిలా పర్యటన నీరుగారిపోవడానికి ప్రధాన కారణంగా వ్యక్తిగత దూషణలేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. జిల్లా ప్రజలు ముద్దుబిడ్డలుగా భావించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లక్ష్యంగా చేసుకొని నిరాధార ఆరోపణలు తెరపైకి రావడంతోనే ప్రజానీకం షర్మిలా దరికి కూడా చేరడం లేదనే పరిశీలకులు వెల్లడిస్తున్నారు. వాస్తవికతకు అనుగుణంగా ఇప్పటికైనా పయనించాల్సిన అవసరం ఉందని పలువురు చెప్పుకొస్తున్నారు. షర్మిలాకు ఇలాంటి దుస్థితి రావడంపై దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు సైతం అమెపై ఆక్రోషం వ్యక్తం చేస్తుండడం విశేషం.

కల్పవల్లి.. గంగమ్మతల్లి

- 11న బలిజపల్లె గంగమ్మ జాతర
- నేడు అంకురార్పణ

రాజంపేట టౌన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు నిర్వాహకులు ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి అంకురార్పణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అందులో భాగంగా బలిజపల్లె గ్రామంలో వెలసిన గంగమ్మ స్వయంభు వద్ద దాదాపు గంటకు పైగా పూజా కార్యక్రమాలను చేపడతారు. మూడు రోజుల పాటు జాతరకు సంబంధించి సంప్రదాయమైన కార్యక్రమాలు చేపట్టి ఈనెల 11వ తేదీ వేకువ జాము నుంచి జాతర ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు.

నేడు అంకాలమ్మకు పొంగళ్లు

మండలంలోని తుమ్మల అగ్రహారం బలిజపల్లె గంగమ్మకు పుట్టినిల్లు అని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల తుమ్మల అగ్రహారంలో వెలసిన అంకాలమ్మకు బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ చేసే సమయంలో పొంగళ్లు పెట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందువల్ల ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గ్రామంలోని మహిళలు అంకాలమ్మకు పొంగళ్లు పెట్టనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బలిజపల్లె గ్రామంలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

గొడవలకు పాల్పడితే బైండోవర్ కేసులు



బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ చేసే సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసులు పెడతాం. డీఎస్పీ చైతన్య ఆదేశాల మేరకు గంగమ్మ జాతర అంకురార్పణ వేడుక ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. అంకురార్పణ వేడుకను, ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు ఇప్పటికే కౌన్సిలింగ్ ఇచ్చాం. అందువల్ల భక్తులు ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పెద్దఎత్తున తరలి రావాలి. బలిజపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం నుంచే గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

– మద్దయ్యఆచారి, అర్బన్ సీఐ, రాజంపేట

మళ్లీ కుటుంబం చెంతకు..

వృద్ధురాలి అదృశ్యం కథ సుఖాంతం


వృద్ధురాలు అచ్చమ్మ

యశవంతపుర (బెంగళూరు): పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి యాచన చేసి జీవిస్తున్న వృద్ధురాలు తహసీల్దార్ చొరవతో కుటుంబ సభ్యుల చెంత చేరింది. వివరాలు.. ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన అచ్చమ్మ(72) ఏడాది క్రితం ఇంటి నుంచి వచ్చి తిరిగి వెళ్లలేదు. దీంతో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు మదనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సదరు వృద్ధురాలు చిక్కమగళూరు చేరుకుంది. తాలూకా కార్యాలయం చుట్టు పక్కల భిక్షాటన చేస్తూ అక్కడే తలదాచుకునేది. ఆమె దుస్థితిని గమనించిన తహసీల్దార్ ఆరా తీశారు. తొలుత స్థానికంగా ఉన్న రోబిన్ ట్రస్టు ప్రతినిధులకు ఆమెను అప్పగించారు. ట్రస్టు ప్రతినిధులు ఆమెకు ఆశ్రయం కల్పించి దుస్తులు ఇచ్చి మంచి ఆహారం అందజేశారు. ఆమెతో మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. తనకు శ్రీను, శంకర్ అనే కుమారులు ఉన్నట్లు చెప్పడంతో వారికి సమాచారం ఇచ్చారు. తహసీల్దార్, పోలీసుల సమక్షంలో అచ్చమ్మను అప్పగించారు.

పుణ్యమార్గం.. పేదలకు దానం

ధనికులతో సమానంగా.. పేదవర్గాలు కూడా జీవనం గడపాలి. ప్రత్యేకంగా పవిత్ర రంజాన్‌ను ఎలాంటి ఆర్థికపరమైన లోటుపాట్లు లేకుండా జరుపుకోవాలి. ఇది ఇస్లాం తత్వం. సమానత్వంతో కూడిన జీవనాన్ని నిర్దేశిస్తోంది. దాన, ధర్మాలు, ధార్మిక సత్కార్యాలకు రంజాన్ మాసం అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

- రంజాన్ మాసంలో దానధర్మాలకు అధిక ప్రాధాన్యం
- ప్రతి వ్యక్తి పేరిట కొంత మొత్తం అందజేత
- ఈ ఏడాది ఫిత్రా రూ.90గా ఖరారు


Sadaqatul Fitr RAMZAN 2024 For Rajampet

Rs:80/.	1.75kg		Wheat
Rs:280/.	3.5kg		Barley
Rs:980/.	3.5kg		Raisin
Rs:1200/.	3.5kg		Dates





రాజంపేట టౌన్/ మదనపల్లి సిటీ : రంజాన్ మాసంలో జకాత్, ఫిత్రా ఇస్తారు. ఫిత్రా అనే పదానికి అర్థం తనతోపాటు ఇతరులకు సంతోషాన్ని ఇవ్వడం. ఈ నేపథ్యంలో ప్రతి వ్యక్తి పేదలకు దానం చేయాలని ఇస్లాం ఆదేశించింది. ఒక కుటుంబంలో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నా.. అందరి పేరిట పేదలకు దానం చేయాలని సూచించింది. రంజాన్ రోజున ప్రత్యేక నమాజు ఆచరించక ముందే ఫిత్రా చెల్లించాలంటూ ఆదేశించింది. ఇది ఒక విధిగా నిర్దేశించింది. దానం విధిగా మారడానికి హదీసులో ఇలా ఉంది. ఉపవాసి చిన్న చిన్న పొరపాట్లను దూరం చేయడానికి, పేద వారు కూడా అందరితో కలిసి పండుగను ఘనంగా జరుపుకోవడానికి దానం ఉపయోగపడుతుంది.

ఏ రూపంలో చెల్లించాలి

సాధారణ స్థితిలో ఉన్న ప్రతి ముస్లిం 1750 గ్రాముల గోధుమలు లేకుంటే అంత సమానమైన డబ్బును పేదలకు దానం చేయడమే ఫిత్రా. ఈ ఏడాది మార్కెట్ ధరలకు అనుగుణంగా పెద్దలు రూ.90 ఖరారు చేశారు. అలాగే జావ 3.5 కేజీలు లేదా రూ.245, ఖర్జూరం 3.5 కిలోలు లేదా రూ.1050 కూడా చెల్లించవచ్చు. 52.50 గ్రాముల వెండి లేదా 75 గ్రాముల బంగారం లేదా అంత విలువైన ధన, ఆస్తులు కలిగివుండే ప్రతి ముస్లిం జకాత్‌కు అర్హుడు. తమ సొమ్మును లెక్కకట్టి అందులో నుంచి 2.5 శాతం పేదలకు పంచాలి.

70 రెట్ల పుణ్యం

కల్మా, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాంకు మూల స్తంభాలు. జకాత్ ఇచ్చిన వారి సొమ్మును అల్లాహ్ రక్షించడమే కాకుండా వృద్ధి చేస్తారని మౌల్వీలు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో కంటే రంజాన్ మాసంలో జకాత్ ఇచ్చే వారికి 70 రెట్ల పుణ్యం అధికంగా లభిస్తుందని, పరలోకంలోనూ లాభం చేకూర్చుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. జకాత్ ఇవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. జకాత్ ఇవ్వని, రోజా ఉండని వ్యక్తిలో వ్యాపార ఆలోచన ఏర్పడుతుందని, తన లాభం చూసుకొని ఇతరుల బాధలు పట్టించుకోరని, ఇది ఇస్లాంకు వ్యతిరేకమని మౌల్వీలు చెబుతున్నారు.

ఎవరు చెల్లించాలి.. ఎవరికి చెల్లించాలి

- ధనవంతులు కాకపోయినా, కనీస ఆదాయ వనరులు ఉన్నవారు సైతం తమ కంటే పేద వారికి ఫిత్రా చెల్లించాలి.
- పండుగ నమాజుకు ముందుగా ఇంట్లో సంతానం కలిగితే శిశువు పేరు మీద కూడా దానం చేయాలి. పేద వర్గాలకే కాకుండా పేద విద్యార్థులు చదువుకునే మదర్సాలకు సైతం సమకూర్చవచ్చు.

జకాత్ తప్పనిసరి



రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం జకాత్, ఫిత్రా ఇవ్వడం తప్పనిసరి. ఇస్లాంలో జకాత్ ఇవ్వడం కచ్చితమైనది. పంచ నియమాల్లో ఇది ఒకటి. దీనివల్ల అల్లాహ్ వారి ఆరోగ్యాలను కాపాడటంతోపాటు సిరిసంపదను వృద్ధి చేస్తారు.

- షేక్ అబ్దుల్లా, సంఘసేవకుడు, రాజంపేట

ధన, ఆరోగ్య బీమా



మనిషి ఆరోగ్యం, ధన సంపదల బీమా జకాత్. ఏడాదికి ఒకసారి తన సంపదనలో నిర్ణీత వెండి, బంగారు విలువపై 2.50 శాతం లెక్క చేసి తదనుగుణంగా పేద ముస్లింలకు సహాయం చేయాలి. ముందు తమ రక్తసంబంధీకులు ఎవరైనా పేదలు ఉంటే వారికి వారికి ఫిత్రా ఇవ్వడం ఉత్తమం.

- గౌస్‌బాషా, రాజంపేట

ప్రతి ముస్లిం పాటించాలి



ఫిత్రా దానాన్ని ప్రతి ముస్లిం కచ్చితంగా పాటించాలంటూ ఇస్లాం నిర్దేశించింది. ఉపవాస దీక్ష సమయంలో దీక్షాపరుని చెడు తలంపు, చెడు ఆలోచనలు, నోటి నుంచి వెలువడే అసత్యాలు.. వంటి పొరపాట్లన్నీ క్షమార్హం అవుతాయంటూ మహ్మద్ ప్రవక్త(సల్లెల్లాహు అలైహివ సల్లం) చెప్పారు.

- హాఫీజ్ ఇక్బాల్‌అహ్మద్, ప్రభుత్వ సర్ఖాజీ, మదనపల్లె



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికి ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో నాకు ఇళ్లు మంజూరు చేయడం వల్ల సొంతింటి కల నెరవేరింది. పట్టణంలోని రజక కాలనీలో కులవృత్తి చేసుకుంటూ అద్దె భవనంలో నివాసం ఉంటున్నాం. నాకు ఇళ్లు మంజూరు చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం.

- అనిత, హౌసింగ్ లబ్ధిదారురాలు, పులివెందుల

సులభంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లలకోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవాలో దరఖాస్తు చేసుకుని అనంతరం పత్రాలు చేతికందాలంటే మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలపడం జరిగింది. ధ్రువపత్రాలు ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చారు. సులభంగా పత్రాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- ఎస్.రెడ్డిబూ, బోడుమల్లువారిపల్లె, పీలేరు

వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న చెన్నమ్మ

మదనపల్లె : భర్త, అత్తింటి వేధింపులను భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. చిప్పిలికి చెందిన సామిరెడ్డి, వి.చెన్నమ్మ(35) దంపతులు. భర్త భవన నిర్మాణ కార్మికుడు కాగా, ఆమెకు కవిత, నందిని అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. అతనితోపాటు అత్తింటి వారు ఆమెను వేధింపులకు గురి చేస్తుండేవారు. ఈ క్రమంలో ఇటీవలే పెద్దకుమార్తెకు వివాహం నిశ్చయం కాగా ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇంటిని విక్రయించి పెళ్లి చేయాలని తల్లి చెన్నమ్మ భావించింది. అయితే ఇంటి విషయంగా చెన్నమ్మతో అత్తింటి వారు అత్త పద్మావతి, మామ నరసింహులు, మరిది దినేష్, తోడికోడలు భాగ్యరేఖతో పాటు లావణ్య, గోవర్ధన్‌లు గొడవకు దిగారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు (35) అనే వ్యక్తి చిన్నదాసరపల్లి గ్రామ పొలాల్లో ఈ నెల 2వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఐదుగురు నిందితులను 'సిట్' ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ వెంకటరాముడు పర్యవేక్షణలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం కడప- పులివెందుల ప్రధాన రహదారిలో కాశినాయన గుట్ట వద్ద అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై శనివారం సాయంత్రం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు వెల్లడించారు. ఈ హత్య కేసులో నిందితులైన చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి అలియాస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి రామసుబ్బారెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి అలియాస్ చిన్ననాగిరెడ్డి, చిన్నగురివిరెడ్డిగారి రామసుబ్బారెడ్డి అలియాస్ డేగా అనే ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. ఈ నెల 2వ తేదీన పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లి గ్రామ పొలాల్లో అనుమానాస్పదంగా చనిపోయిన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేశారని ఆరోపిస్తూ మృతుడి తమ్ముడు ఆదిమూలపు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెండ్లిమర్రి పోలీసులు విచారణ చేపట్టారన్నారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ వెంకటరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రత్యేక బృందం ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలియజేశారు. నిందితులలో చిన్న గురివిరెడ్డి గారి నాగిరెడ్డి వద్ద నుంచి టీషర్ట్, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ హత్య కేవలం భూమి సమస్య తగాదా వల్లనే జరిగినట్లు తెలియజేశారు. సదరు గ్రామ పరిధిలో 70 సెంట్ల భూమి సంబంధించి సమస్య ఇరువర్గాల మధ్య తలెత్తినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.

ఎంపీపీ భర్తపై దాడి


గాయపడిన నరసింహులు

బి.కొత్తకోట : ప్రభుత్వ భూమిలో చెట్లను కొట్టివేస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఎంపీపీ లక్ష్మీ నరసమ్మ భర్త నరసింహులు ఫిర్యాదు చేశారనే నెపంతో.. కొందరు వారిపై ఇంటిపై దాడి చేసి పలువురిని గాయపరిచారని సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీలో నరేష్, మరి కొందరు ప్రభుత్వ భూమిలో చెట్లును నరికి దౌర్జన్యంగా తీసుకెళ్లారు. దీనిపై నరసింహులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న నరేష్, ఇతరులు శనివారం ఎంపీపీ ఇంటి వద్దకు వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో నరసింహులు శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. మరికొందరు గాయపడ్డారు. బాధితులు సీహెచ్‌సీలో వైద్య చికిత్సలు పొందారు. దీనిపై నరసింహులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అదుపు తప్పిన కంటైనర్


రోడ్డుపై పడిన కంటైనర్ లారీ

నందలూరు(రాజంపేట) : కడప-చెన్నై జాతీయ రహదారిలో తహసీల్దార్ కార్యాలయం మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చెన్నై నుంచి మహారాష్ట్రకు టైర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌ను అక్కడి నుంచి తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వేశారు.

నర్సరీలో అగ్నిప్రమాదం


కాలిపోయిన వెదురు చెట్లు

పీలేరు రూరల్ : మండలంలోని అగ్రహారం పంచాయతీ ఫారెస్ట్ నర్సరీలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. శనివారం మధ్యాహ్నం నర్సరీ చుట్టూ ఉన్న కంచెకు నిప్పంటుకుంది. ఫారెస్ట్ నర్సరీలోని వెదురు చెట్లు కాలిపోయాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన వెదురు అగ్నికి ఆహుతైనట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్.మస్తాన్ తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలు తెలియరాలేదు.

దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి వాణివీధికి చెందిన కె.అంబరీష్(30) అతడి బంధువు, వరుసకు మామ అయిన వెంకటరమణ(65) ఇద్దరూ కలిసి కురబలకోట మండలంలోని అంగళ్లు గొర్రెలసంతకు వచ్చారు. అక్కడ గొర్రెలకు నీరు పట్టించే విషయమై స్థానికుడైన బాబ్‌జాన్‌తో వాగ్వివాదం జరిగింది. ఈ గొడవలో ఆవేశానికి లోనైన బాబ్‌జాన్ వారిద్దరిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో అంబరీష్, వెంకటరమణలు తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం అంబరీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన మహిళ మృతి

నిమ్మనపల్లె : గడ్డికి కొట్టే పురుగుల నివారణ మందును పొరపాటుగా తాగి ఆస్పత్రి పాలైన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన ప్రభాకరరెడ్డి భార్య ఆర్.సుజాత(48) మానసికస్థితి సరిగ్గా లేకపోవడంతో చికిత్సలు తీసుకుంటోంది. శుక్రవారం సాయంత్రం గడ్డిమందు పొరపాటున తాగి తీవ్ర అస్వస్థతకు లోనైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన చికిత్సల కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుజాత శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో రచ్చకెక్కిన వర్గ విభేదాలు

ఎమ్మెల్యే అభ్యర్థి సాక్షిగా తిట్టుకున్న తమ్ముళ్లు

ములకలచెరువు : తంబళ్లపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరపల్లి జయచంద్రారెడ్డి సాక్షిగా.. తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న వర్గ విభేదాలు శనివారం బయటపడ్డాయి. ఈ సంఘటన ఎమ్మెల్యే అభ్యర్థి సొంత మండలంలో చోటు చేసుకోవడం గమనార్హం. టీడీపీ అభ్యర్థితోపాటు మాజీ జెడ్పీటీసీ కువైట్ శంకర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రమణ, మాజీ సర్పంచ్ సురేష్ తోపాటు పలువురు మండలంలోని ఏసువారిపల్లి, చిన్న అంగడివారిపల్లి, పెద్ద అంగడివారిపల్లిలో ప్రచారం ముగించుకుని కోనేటివారిపల్లికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మీ ఇష్టానుసారంగా ప్రచారం ఎలా చేస్తారని అదే గ్రామంలోని టీడీపీ మండలాధ్యక్షుడు పాలగిరి శిద్దా ప్రధాన అనుచరుడు ఉమాశంకర్ అనే వ్యక్తి అభ్యర్థి ఎదుటే కువైట్ శంకర్, రమణ, సురేష్‌లను ప్రశ్నించాడు. అంతటితో ఆగకుండా గత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ తరఫున నామినేషన్ వేసి డబ్బుకు అమ్ముడుపోయి నామినేషన్ వెనక్కి తీసుకున్నారని ఆరోపించాడు. తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండిపోయిన మీరు మా పంచాయతీలో పెత్తనం చలాయించడం ఏంటని ఉమాశంకర్ కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో వారిని నిలదీశాడు. సహనం కోల్పోయిన కువైట్ శంకర్ అతడిని నానా దుర్భాషలాడుతూ నిన్న.. మొన్న పార్టీలోకి వచ్చిన నీకు సమాధానం చెపాల్సిన అవసరం లేదని విరుచుకపడ్డాడు. పక్కనే ఉన్న పాలగిరి సిద్దా తన అనుచర వర్గీయులు ఒక్కసారిగా మాజీ జెడ్పీటీసీ వర్గంపైకి దూసుకెళ్లారు. పత్రికల్లో రాయలేని విధంగా బండ బూతులతో ఒకరికొకరు రెచ్చిపోయారు. తోపులాటలు సైతం జరగడంతో అక్కడ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అభ్యర్థి జయచంద్రారెడ్డి ఇరు వర్గాలకు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇరు వార్గల వారు అభ్యర్థి మాట వినకపోవడంతో ఇలాగైతే అందరూ పార్టీలో నుంచి వెళ్లిపోండి, ప్రజల మధ్యనే తిట్టుకోవడం, కొట్టుకోవడం చేస్తే పార్టీకి చెడ్డ పేరు వస్తుంది, ఎవరు కోవర్టులో, పార్టీ కోసం ఎవరు పని చేస్తున్నారో అంతా తనకు తెలుసు, పార్టీని నవ్వుల పాలు చేయడానికి చూస్తున్నారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అందరూ మిన్నకుండిపోయారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని అర్ధాంతరంగా నిలిపేసి వెనుదిరిగారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


శ్రావణి మృతదేహం

గుర్రంకొండ : తాగునీటి బోరు వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన శోభనాల జనార్ధన్(28), శోభనాల శ్రావణి(23)లు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి చరిత(03), మోక్షిత(18 నెలల) పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు వారు నివాసముంటున్న పంచాయతీ తాగునీటి బోరు ఆన్ చేసి తాగునీరు తెచ్చుకోవడానికి వెళ్లింది. మొదటగా మోటర్ ఆన్ చేసింది. ఆ తరువాత బోరు వద్దకు వెళ్లి బోరులో నీరు వస్తుందో రాలేదో అని అనుమానంతో పైపులు తాకింది. అప్పటికే బోరుపైపులకు విద్యుత్ సరఫరా ఉండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితురాలిని చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాధితురాలని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నె తండాలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. స్థానికంగా నివాసం ఉన్న వెంకటరమణనాయక్ భార్య బుక్కే బుడ్డమ్మ(55) సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం తవళం గ్రామం ముతకనబండకు చెందిన లక్ష్మన్న, నాగమ్మ(42) దంపతులు ఉపాధి కోసం కర్ణాటకకు వెళ్లారు. తిరిగి ఉగాది పండుగ కోసం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా, మార్గంమధ్యలోని లక్ష్మీపురం క్రాస్ సమీపంలో వెనుకవైపు కూర్చున్న నాగమ్మ వాహనంపై నుంచి అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా తంబళ్లపల్లె మండలం పరుసుతోటకు చెందిన రమణమ్మ(68) స్థానికంగా ఉన్న చిల్లర దుకాణానికి వెళుతుండగా, గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఆమెను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. వాల్మీకిపురం పట్టణం ఎస్‌టీఆర్ కాలనీకి చెందిన రాజశేఖర్(40) వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం వాల్మీకిపురంలో పేపర్ బండిల్స్ డెలివరీ చేసి పెద్దమండ్యం బయలుదేరాడు. మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

రామసముద్రం : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె గ్రామానికి చెందిన రెడ్డిప్రసాద్ (19) ముళబాగిల్‌కు చెందిన రెడ్డి(13) లు ద్విచక్రవాహనంలో కర్ణాటక రాష్ట్రం వనిగిరి నుంచి ముళబాగిల్‌కు బయలుదేరారు. అయితే మార్గంమధ్యలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో రెడ్డిప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను ఐచర్ వాహనంలో రామసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు.

గువ్వలచెరువు ఘాట్‌లో లారీ బోల్తా

చింతకొమ్మదిన్నె : కడప - రాయచోటి ప్రధాని రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి మూడవ మలుపు వద్ద సిమెంటు ట్యాంకర్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని క్రేన్ సాయంతో తీసివేసినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యాపారి నుంచి రూ. 8.50 లక్షల స్వాధీనం

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన శశిధర్ అనే పూతరేకుల హోల్‌సేల్ వ్యాపారి శనివారం బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు రూ.8.50 లక్షలను కడపకు తీసుకుని వచ్చారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎస్పీ బంగళాకు వెళ్లే మార్గంలో కడప వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి చేసిన తనిఖీలలో ఈ వ్యాపారి పట్టుబడ్డాడు. ఎన్నికల సమయంలో రూ.50 వేల కంటే ఎక్కువగా తీసుకుని వెళ్లకూడదనే నిబంధనల మేరకు అతని దగ్గరున్న డబ్బును స్వాధీనం చేసుకుని.. కడప ఆర్డీఓ మధుసూదన్‌కు ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి వ్యాపారి సమక్షంలోనే అప్పగించారు.